www.jananinadam.com RNI NO:TGTEL/25/A0870

Follow :

జనినినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి అయుధం

తెలుగు దినపత్రిక

బుధవారం 28-10-2026

సంపుటి : 2 సంచిక : 170

ఆసిఫాబాద్ Asifabad

హైదరాబాద్ Hyderabad


ఎడిటర్ : జాధవ్ రోహిదాష్

Editor: JADAV ROHIDAS

పేజీలు : 06

వెల: రూ.2.00

Simultaneously published from
,Asifabad, Karimnagar, Adilabad ,
www.jananinadam.com



2వ పేజీలో...

బీబీకే ఓటేయండి..

ఇజ్రాయెల్ ఎన్నికల్లో ట్రంప్ ప్రచారం

- నెతన్యాహుకు మరోసారి మద్దతు ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్
- గెలిస్తే ఇరాన్‌పై చర్యలు కొనసాగిస్తామని నెతన్యాహు సంకేతాలు
- నవంబర్ 3లోపు ఇరాన్‌పై దాడి ఉండదని స్పష్టం చేసిన వైట్‌హౌస్
- నెతన్యాహు భయానక ప్రచారం చేస్తున్నారని ప్రత్యర్థి విమర్శలు

ఢిల్లీ,: ఇజ్రాయెల్‌లో జరగనున్న ఎన్నికలకు ముందు ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తన ప్రచారాన్ని ఉద్ధృతం చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనకు మద్దతు ప్రకటించడాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, తాను తిరిగి అధికారంలోకి వస్తే ఇరాన్‌పై సైనిక చర్యను పునఃప్రారంభించే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. ఆదివారం ట్రంప్ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, “మనం ప్రారంభించిన పనిని పూర్తి చేయాలి! ప్రధానిగా బీబీ నెతన్యాహుకే ఓటు వేయండి!” అని పిలుపుని చ్చారు. ఫిబ్రవరిలో ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా–ఇజ్రాయెల్ ప్రారంభిం చిన ఉమ్మడి ప్రచారాన్ని ఉద్దేశించి ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.



2వ పేజీలో...

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై..

పిటిషన్లు

- తదుపరి విచారణ నవంబర్ 17కు వాయిదా
- ఈసీ అఫిడవిట్‌పై స్పందనకు పిటిషనర్లకు రెండు వారాల గడువు
- ఫారం-6లో మార్పులపై విచారణలో వాదనలు
- 'సర్' నిర్ణయాలు పక్రీవమని ఈసీ వివరణ
- ఓటర్ల జాబితా నిర్వహణపై పిటిషన్లలో అభ్యంతరాలు

ఢిల్లీ,: సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పనితీరును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు భారత ఎన్నికల సంఘానికి (ఈసీ) నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్లపై సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. ఎన్నికల సంఘం దాఖలు చేసిన అఫిడవిట్‌పై తమ స్పందన తెలియజేసేందుకు పిటిషనర్లకు రెండు వారాల గడువు ఇచ్చింది. విచారణ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ దోలా సేన్ తరఫున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి వాదనలు వినిపించారు.



2వ పేజీలో...

అమెరికా మధ్యంతర ఎన్నికలు

ట్రంప్‌కు గట్టి ఎదురుగాలి!

- ప్రతినిధుల సభలో డెమొక్రాట్లకు ఆధిక్యం ఖాయమంటున్న సర్వేలు
- సెనేట్‌లో మాత్రం హోరాహోరీ తప్పదని అంచనా
- 38 శాతంకి పడిపోయిన ట్రంప్ ప్రజాదరణ
- పెరిగిన ధరలు, ద్రవ్యోల్బణం ఓటర్లపై తీవ్ర ప్రభావం

వాషింగ్టన్: అమెరికా మధ్యంతర ఎన్నికలకు మరో వారం రోజులే గడువు ఉండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీకి ఈ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగలవ చ్చని ప్రధాన సర్వేలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్)లో డెమొక్రా ట్లు స్పష్టమైన ఆధిక్యం సాధించే అవకాశం కనిపిస్తోంది. ప్రముఖ విశ్లేషక సంస్థ 'రియల్ క్లియర్ పాలిటిక్స్' అంచనా ప్రకారం, ప్రతినిధుల సభలో డెమొక్రాట్లు సుమారు 227 సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది. 'కుక్ పొలిటికల్ రిపోర్ట్'

ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు

కేటీఆర్, హరీశ్ రావు భ్రమల్లో ఉన్నారు



2వ పేజీలో...

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుస్తుందని మహేశ్ గౌడ్ ధీమా
- తెలంగాణలో బీజేపీ పని అయిపోయిందని వ్యాఖ్య
- ఆలోచన లేకుండా అప్పులు చేసి కేసీఆర్ రాష్ట్రాన్ని ముంచారని ఆరోపణ

హైదరాబాద్,: బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు ఇంకా భ్రమల్లోనే జీవిస్తున్నారని, క్షేత్రస్థాయి వాస్తవాలను వారు గ్రహించడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుచుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మేధావి అని చెప్పుకునే కేసీఆర్ ఎలాంటి ఆలోచన లేకుండా అప్పులు చేశారని మహేశ్ గౌడ్ విమర్శించారు. ఎల్ నినో ప్రభావం దేశవ్యాప్తంగా ఉంటే, దాని గురించి హరీశ్ రావు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, 90,000 ఉద్యోగాలు పొందిన ప్రతి లబ్ధిదారుడు కాంగ్రెస్‌కే ఓటు వేస్తారని... క్షేత్రస్థాయిలో తమ పార్టీ బలంగా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని... దేశంలో ఎక్కడా లేనంతగా తమ పార్టీలో సమన్వయం ఉందని మహేశ్ గౌడ్ తెలిపారు. నవంబర్‌లో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని,



2వ పేజీలో...

ఈటల రాజేందర్ పాదయాత్రకు బ్రేక్

అనుమతి నిరాకరించిన పోలీసులు



మంచిర్యాల జిల్లాలో పెద్ద పులి సంచారం

భయాందోళనలో గ్రామస్థులు



2వ పేజీలో...

రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది

- ప్రభుత్వమే కృత్రిమ కరవు సృష్టిస్తోందని కేటీఆర్ ఆరోపణ
- గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయడం లేదని విమర్శ
- మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని వ్యాఖ్య

హైదరాబాద్,: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయి లో విమర్శలు గుప్పించారు. గోదావరిలో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఎత్తిపోయకుం డా ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో కరవు పరిస్థితు లను సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు.



2వ పేజీలో...

వర్షాల కోసం రైతన్నల ఎదురుచూపులు!

తుఫానుఎండల సెగ నుంచి ఉపశమనం కలిగించేనా వర్షం పడితే పంటలకు ప్రాణం!



మహబూబాబాద్: ఒకవైపు ఎండల తీవ్రత.. మరోవైపు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు.. ఇంకోవైపు పంటల పరిస్థితిపై ఆందోళన చెందుతున్న అన్నదాతలు! ఇలాంటి తరుణంలో బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ వ్యవస్థ బలపడి తుపానుగా మారే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ అంచనాలు రైతుల్లో కొత్త ఆశలను రేకెత్తిస్తున్నాయి. రానున్న రోజుల్లో కురిసే వర్షాలు తమ పంటలకు ప్రాణం పోస్తాయా? సాగు ఖర్చులైనా చేతికొస్తాయా? అన్న ఆశతో రైతన్నలు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు.

ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు విచారణ

రాహుల్ గాంధీ పోస్టులో 'సత్యం శివం సుందరం'

- ఎస్ఐఆర్ విచారణకు ముందు రాహుల్ గాంధీ శివుడి చిహ్నంతో పోస్ట్
- 'సత్యం శివం సుందరం' అనే పదాలను జోడించిన కాంగ్రెస్ అగ్రనేత
- ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాల అభ్యంతరాలు
- అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదముందని పిటిషనర్ల ఆరోపణ
- ఎన్నికల సంఘం నిర్ణయాలపై న్యాయ సమీక్ష కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్
- ఎస్ఐఆర్ నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నామని ఎన్నికల సంఘం వాదన



ఢిల్లీ,: ఓవైపు ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పోరు.. మరోవైపు సుప్రీంకోర్టులో కీలక విచారణ. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ చర్చనీయాంశమైంది. 'సత్యం శివం సుందరం' అనే పదాలతో పాటు శివుడికి సంబంధించిన చిహ్నాన్ని ఆయన పంచుకున్నారు.

బీబీకే ఓటేయండి..



మొదటిపేజీ తరువాయి...

ట్రంప్‌తో తనకున్న సంబంధం అపూర్వమైనదని నెతన్యాహు ఒక టెలివిజన్ కార్యక్రమంలో అన్నారు. తనకు ఓటు వేయాలని ఇజ్రాయెల్ ప్రజలను ట్రంప్ కోరారని తెలిపారు. ఇరాన్ పాలనను కూలదోయడానికి కృషి చేయాలని మొస్సాద్, ఇజ్రాయెల్ రక్షణ దళాలను (ఐడీఎఫ్) ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. ఇరాన్ నుంచి ముప్పును అంతం చేయడానికి ఇదొక్కటే మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, ఈ వ్యాఖ్యలపై వైట్‌హౌస్ స్పందించింది. ఇరాన్ ప్రస్తుతం ఆర్థికంగా, సైనికంగా చాలా బలహీన స్థితిలో ఉందని, ఆంక్షలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. నవంబర్ 3న జరగనున్న అమెరికా మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై దాడి చేసే ప్రసక్తే లేదని వైట్‌హౌస్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ అన్నా కెల్లీ తెలిపారు. మరోవైపు, నెతన్యాహు ప్రధాన ప్రత్యర్థి, మాజీ సైన్యాధిపతి గాడీ ఐసెన్‌కోట్... నెతన్యాహు తీరుపై విమర్శలు గుప్పించారు. ట్రంప్‌ను "ఇజ్రాయెల్ నిజమైన స్నేహితుడు" అని అభివర్ణించిన ఆయన, ఎన్నికల్లో ప్రజలను భయపెట్టి లబ్ధి పొందాలని నెతన్యాహు చూస్తున్నారని ఆరోపించారు. టెల్ అవీవ్‌పై అణుబాంబు పేలినట్లుగా ఏఐ సృష్టించిన చిత్రాలతో ప్రచారం చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. అక్టోబర్ 7, 2023న జరిగిన హమాస్ దాడుల తర్వాత ఇజ్రాయెల్‌లో జరుగుతున్న తొలి ఎన్నికలు ఇవి. తాజా పోల్స్ ప్రకారం, నెతన్యాహు నేతృత్వంలోని సంకీర్ణానికి మెజారిటీ రావడం కష్టమని తెలుస్తుండగా, ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో ప్రతివక్షాలు కూడా సవాళ్లను ఎదుర్కొంటున్నాయి.

అమెరికా మధ్యంతర ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి...

సైతం డెమొక్రాట్లకు 220 సీట్లు దక్కవచ్చని, సభపై పట్టును నిలుపుకోవడంలో రిపబ్లికన్లకు అవకాశాలు సన్నగిల్లాయని విశ్లేషించింది. అలాగే సీబీఎస్ న్యూస్ అంచనా ప్రకారం డెమొక్రాట్లకు 229 సీట్లు దక్కవచ్చు. అయితే, సెనేట్ విషయంలో మాత్రం ఫలితాలు హోరాహోరీగా ఉండవచ్చని, దీనిపై వివిధ సర్వే సంస్థలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయని తెలుస్తోంది. ఐఏఎన్ఎస్ కథనం ప్రకారం, ట్రంప్ పనితీరు పట్ల కేవలం 38.2 శాతం మంది మాత్రమే సానుకూలంగా ఉండగా, 60.2 శాతం మంది వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాల వల్ల తమ ఆర్థిక పరిస్థితి దిగజారిందని 57 శాతం మంది ఓటర్లు అభిప్రాయపడు తున్నారు. టారిఫ్ యుద్ధాల ప్రభావం, గాలన్ పెట్రోల్ ధర సుమారు ₹4.28కి, డీజిల్ ధర ₹6.28కి పెరగడం, 3.7 శాతం ద్రవ్యోల్బణం, ఇరాన్‌తో నెలకొన్న దౌత్యపరమైన వివాదాలు ఓటర్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు ట్రంప్ తన పట్టును కాపాడుకునేందుకు రిపబ్లికన్ల ప్రాబల్యం ఉన్న రాష్ట్రాలపైనే ప్రధానంగా దృష్టి సారించి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా సుమారు 3 కోట్ల మంది ఓటర్లు తమ ముందస్తు ఓటింగ్ హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ప్రతినిధుల సభ లేదా సెనేట్‌లో గనుక రిపబ్లికన్ పార్టీ అధికారాన్ని కోల్పోతే, ట్రంప్ తన మిగిలిన రెండేళ్ల పదవీ కాలంలో తన విధానాలను, అజెండాను అమలు చేయడం అత్యంత క్లిష్టతరంగా మారుతుంది.

తెలంగాణలో 1.90 లక్షల మంది మహిళలకు కుట్టు మిషన్లు

మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, అక్టోబర్ 27: బీసీ సంక్షేమ శాఖ, విద్యా నిధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. 38 బీసీ ఆత్మగౌరవ భవనాల జీవోల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. డిసెంబర్ 9న మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీకి కార్యాచరణ చేపట్టాలని, కుట్టు మిషన్ల పథకానికి 4.80 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. 1.90 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. తెలంగాణలోని 327 గురుకులాల్లో 26 పాఠశాలలకే సొంత భవనాలు ఉన్నాయని, మిగిలిన 301 గురుకులాలకు సొంత భవనాల నిర్మాణంపై దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. గురుకులాలకు అవసరమైన స్థలాల సేకరణను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. బీసీ స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు, ఉద్యోగాలే లక్ష్యంగా నాణ్యమైన శిక్షణ అందించాలన్నారు. బీసీలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. బీసీ వితంతువులు, ఒంటరి మహిళలకు నైపుణ్య శిక్షణపై ప్రత్యేక కమిటీని నియమించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆధునిక ధోబీఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ఆదేశాలు జారీ చేశారు.

తుమ్మిడిహెట్టి చర్చలు పెద్ద డ్రామా

ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్రంలో కరవు నెలకొందన్న బాల్క సుమన్

నీళ్లు, కరెంట్ లేక రైతుల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన

సమస్యలు పరిష్కరించకుండా హరీశ్, కేటీఆర్‌లపై విమర్శలెందుకని ప్రశ్న



హైదరాబాద్,: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే పంటలు ఎండిపోతున్నాయని, ఇది ప్రకృతి వైపరీత్యం కాదని, ప్రభుత్వమే సృష్టించిన కరవు అని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. ప్రజల దృష్టిని మరల్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రైతులు నీళ్లు, కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వం తుమ్మిడిహెట్టి పేరుతో కొత్త నాటకానికి తెరలేపిందని సుమన్ మండిపడ్డారు. ఇటీవల మహారాష్ట్ర ప్రభుత్వంతో రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జరిపిన చర్చలను ఓ పెద్ద డ్రామాగా అభివర్ణించారు. ఉన్న నీటిని ముందుగానే వదిలేసి, ఇప్పుడు బ్యారేజీ నిర్మిస్తామని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడానికే అని అన్నారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని మాజీ మంత్రి హరీశ్ రావు పూర్తి వివరాలతో నిన్ననే వివరించారని గుర్తు చేశారు. సమస్యపై స్పందించకుండా మంత్రులు కేవలం హరీశ్ రావు, కేటీఆర్‌లను దూషించడం సరికాదని హితవు పలికారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్టులను ఆన్ చేసి ఉంటే సంబంధిత జిల్లాలకు నీరందేదని సుమన్ అభిప్రాయపడ్డారు. నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం గతంలోనే స్పష్టం చేసినప్పుడు, తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రైతుల సమస్యల నుంచి దృష్టి మరల్చడానికే ఈ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్, ఎంత ఆయకట్టుకు లబ్ధి చేకూరుతుంది, అయ్యే ఖర్చు వివరాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కురువ విజయ్ కుమార్, కె. కిశోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై పిటిషన్లు..

మొదటిపేజీ తరువాయి...

కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం-6లో మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం వ్యవహరించిన తీరుపై ఆమె అభ్యంత రాలు వ్యక్తం చేశారు. ఫారం-6లో మార్పులకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చినట్లు ఈసీ పత్రికా ప్రకటనలో పేర్కొందని ఆమె ఆరోపించారు. దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి.. పరిశీలిస్తామని తెలిపారు. మరోవైపు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల సంఘం తన అఫిడవిట్‌లో పేర్కొంది. ఫారం-6ను మూడు సర్ ఉత్తర్వుల ద్వారా మార్చారన్న ఆరోపణను కూడా తోసిపుచ్చింది.ఎన్నికల సంఘం పనితీరులో పారదర్శకత, ఓటర్ల జాబితా నిర్వహణకు ఉపయోగించే ERONET వ్యవస్థలో అధికారాల కేంద్రీకరణ, ఓటర్ల పేర్ల నమోదు, తొలగింపులపై ఈ పిటిషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలను పట్టించుకోకుండా కొన్ని నిర్ణయాలు తీసుకున్నా రంటూ గతంలో వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ వివాదం మరింత చర్చనీయాంశమైంది. అయితే, 'సర్'కు సంబంధించిన తుది నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఈసీ స్పష్టం చేసింది.


కేటీఆర్, హరీశ్ రావు భ్రమల్లో ఉన్నారు

మొదటిపేజీ తరువాయి...

ఆ తర్వాత తమ ప్రత్యక్ష లక్ష్యం ఎన్నికలేనని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని, ఆ పార్టీ పని అయిపోయిందని జోస్యం చెప్పారు. ప్రస్తుతం ఉన్న 8 ఎంపీ సీట్లలో రెండు కూడా గెలవడం కష్టమేనని.. మరోవైపు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరు కూడా గెలవరని అన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 40 శాతం సీట్లు తమకే వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

వర్షాల కోసం రైతన్నల ఎదురుచూపులు!

మొదటిపేజీ తరువాయి...



వర్షమే రైతన్నకు జీవనాధారం!: ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ వ్యవస్థ అక్టోబర్ 26 నాటికి తుపానుగా మారే అవకాశం ఉండగా, అక్టోబర్ 28 ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపించే సూచనలున్నాయి. దీని ప్రభావంతో తెలంగాణలోనూ పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా మహబూబాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ తదితర జిల్లాల్లో వర్షాలు కురిస్తే వ్యవసాయ రంగానికి కొంత ఊరట లభించే అవకాశం ఉంది. అయితే వర్షాల పరిమాణం, విస్తృతి, తీవ్రతపై స్పష్టత వాతావరణ శాఖ తాజా సూచనలతోనే తెలుస్తుంది.

చినుకు పడితే కోట్ల ఆశలకు జీవం!: వ్యవసాయమే ప్రధాన జీవనాధా రంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఆశలన్నీ వర్షాలపైనే కేంద్రీకృత మయ్యాయి. ఇప్పటికే పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసిన రైతులకు అనుకూల వాతావరణం ఎంతో అవసరం. సరైన సమయం లో వర్షం కురిస్తే పంటలకు మేలు జరగడంతో పాటు భూగర్భ జలాలు, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు పెరిగే అవకాశం ఉంటుంది. తద్వారా రానున్న సాగుకు కూడా ప్రయోజనం కలగవచ్చు. తుపాను ప్రభావంతో వర్షాలు కురిసి పంటలకు అనుకూల పరిస్థితులు ఏర్పడితే రైతులు పెట్టిన పెట్టుబడులు వృథా కాకుండా కొంతైనా ఆశించిన ఫలితాలు దక్కుతాయని భావిస్తున్నారు. వ్యవసాయ రంగంలో కోట్లాది రూపాయల విలువైన పంటల భవితవ్యం వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉండటంతో ప్రతి చినుకు రైతులకు విలువైనదిగా మారింది. ఆశతో పాటు ఆందోళన కూడా!: వర్షాల కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నప్పటికీ, తుపాను తీవ్రత పెరిగి అతి భారీ వర్షాలు, ఈదురుగాలులు సంభవిస్తే పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం కూడా ఉంది. పొలాల్లో నీరు నిలిచిపోవడం, పంటలు నేలకొరగడం, కోతకు సిద్ధమైన పంటలు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అందుకే రైతుల్లో ఒకవైపు వర్షాలు కురుస్తాయన్న ఆనందం, మరోవైపు తుపాను వల్ల నష్టం జరుగుతుందేమోనన్న ఆందోళన కనిపిస్తోంది. అన్నదాతల చూపులు ఆకాశంవైపు!: ప్రకృతి అనుకూలిస్తేనే వ్యవసా యం సాఫీగా సాగుతుందని మరోసారి రుజువవుతున్న వరిస్థితులు కనిపిస్తున్నాయి. తుపాను ప్రభావం రైతులకు మేలు చేస్తుందా? లేక ఇబ్బందులు సృష్టిస్తుందా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. ప్రస్తుతానికి మాత్రం వర్షం కోసం రైతన్నలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వరుణుడు కరుణించి సకాలంలో వానలు కురిపిస్తే పంటలకు ప్రాణం పోసినట్లేనని, రైతుల శ్రమకు ఫలితం దక్కే అవకాశాలు మెరుగుప డతాయని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈటల రాజేందర్ పాదయాత్రకు బ్రేక్

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు డిమాండ్‌తో యాత్రకు పిలుపు

- ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్‌లో ప్రారంభానికి ముందే ఉద్రిక్తత

- ఎంపీగా తన నియోజకవర్గంలో పర్యటించే హక్కు ఉందన్న ఈటల

- గతంలో ఇదే అంశాన్ని సీఎం రేవంత్ ప్రస్తావించారని గుర్తు చేసిన బీజేపీ ఎంపీ



హైదరాబాద్,: మల్కాజ్‌గిరి ఎంపీ, భారతీయ జనతా పార్టీ నేత ఈటల రాజేందర్ తలపెట్టిన "మహా పాదయాత్ర"కు పోలీసులు అనుమతి నిరాకరించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈరోజు ఉదయం ఈ యాత్ర ప్రారంభం కావాల్సి ఉండగా, చివరి నిమిషంలో పోలీసులు అనుమతి నిరాకరించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ నుంచి నాలుగు రోజుల పాటు ఈ పాదయాత్ర జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా ఈటల రాజేందర్ ఉదయాన్నే ఏదులాబాద్ చేరుకుని, స్థానిక రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 5,000 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి యాత్రను ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా, పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. పోలీసుల చర్యపై ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పర్యటించి, ప్రజల సమస్యలను తెలుసుకునే హక్కు తనకుందని ఆయన స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌కు లేఖ రాసి అనుమతి కోరినట్లు వెల్లడించారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఇదే జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై పార్లమెంటులో మాట్లాడారని ఈటల గుర్తుచేశారు. నాడు రేవంత్ రెడ్డి లేవనెత్తిన అంశంపైనే ఇప్పుడు తాను పాదయాత్ర చేస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. పోలీసుల అనుమతి నిరాకరణ నేపథ్యంలో పాదయాత్ర ముందుకు సాగుతుందా? లేదా? అనే దానిపై అనిశ్చితి నెలకొంది. ఈ క్రమంలో ఏదులాబాద్‌లో ప్రస్తుతం ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వం రైతులను వరి వేయవద్దని చెప్పడాన్ని తప్పుబట్టారు. "రాష్ట్రం ప్రస్తుతం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది" అని కేటీఆర్ మండిప డ్డారు. రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించిన ట్టుగా, రాష్ట్రంలో కరవు ఉంటే ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనులకు టెండర్లు పిలుస్తోందని ఎద్దేవా చేశారు. మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ప్రజలుఓపిక పట్టాలని కోరారు. అయితే కేటీఆర్ ఆరోపణలను కాంగ్రెస్ నేతలు ఖండించారు. కేటీఆర్ వి దొంగ కన్నీళ్లని, గోదావరి జలాలను వృథా చేయడం లేదని, ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నీటిమట్టం తక్కువగా ఉన్నందున పంపులను నడపడం సాధ్యం కాదని వారు స్పష్టం చేశారు.

తప్పిపోయిన ఇద్దరు చిన్నారులు.. గంటల వ్యవధిలోనే కాపాడిన పోచంపల్లి పోలీసులు

భూదాన్ పోచంపల్లి: తప్పిపోయిన ఇద్దరు చిన్నారుల ఆచూకీని కేవలం కొద్ది గంటల వ్యవధిలోనే కనిపెట్టి, తల్లి ఒడికి సురక్షితంగా చేర్చిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి లో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పద్మనగర్‌కు చెందిన కడమంచి మహేష్ మంగమ్మ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. తన కుమారుడు నాని (5), కుమార్తె అమ్ములు (3) మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి ఎంతసేపటికీ తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళనతో మధ్యాహ్నం 1:30 గంటలకు తల్లిదండ్రులు పోచంపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. కళ్లముందు కనపడకుండా పోయిన పిల్లల కోసం తల్లడిల్లుతున్న ఆ తల్లి వేదనను చూసిన పోలీసులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే రంగంలోకి దిగారు. హెడ్ కానిస్టేబుల్ ఏ. రమేష్, డబ్లూపీసీ లలిత,హెచ్‌జీఓ ఇస్తారి లు యుద్ధప్రాతిపదికన పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పట్టణ శివారులోని బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయం సమీపంలో ఉన్న కాలువ వద్ద పిల్లలిద్దరూ ఉండడానికి గమనించి ?ఎలాంటి ప్రమాదం జరగకముందే అప్రమత్తమై పిల్లలను సురక్షితంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి, వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి, త్వరితగతిన తమ బిడ్డలను తమ చెంతకు చేర్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి పిల్లల తల్లిదండ్రులు చేతులెత్తి కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుల సమయస్ఫూర్తిని, బాధ్యతాయుతమైన పనితీరు పట్ల స్థానిక ప్రజలు సైతం ప్రశంసిస్తున్నారు.

ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు విచారణ

మొదటిపేజీ తరువాయి...

ఎస్ఐఆర్‌పై పిటిషన్ల విచారణకు ముందు ఈ పోస్ట్ రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎస్ఐఆర్‌పై వివాదం ఏంటి: ఓటర్ల జాబితాలో పేర్లను పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లు కొనసాగించడం, అనర్హుల పేర్లను తొలగించడం కోసం చేపట్టే ప్రక్రియే ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్). ఈ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం ఉందని రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సంఘం నిర్ణయాలపై న్యాయ సమీక్ష జరపాలని కోరుతూ వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ ఆరోపణలు ఇంకా న్యాయస్థానంలో విచారణలోనే ఉన్నాయి. ఎన్నికల సంఘం ఏం చెప్పింది?: ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలన్నీ ఎన్నికల సంఘం ఏకగ్రీవంగానే తీసుకుందని కమిషన్ సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తెలిపింది. మరోవైపు, ఈ నిర్ణయాలపై తమ అభ్యంతరాలను పరిశీలించాలని పిటిషనర్లు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు విచారణపై ఆసక్తి నెలకొంది.

మంచిర్యాల జిల్లాలో పెద్ద పులి సంచారం

మొదటిపేజీ తరువాయి...

మంచిర్యాల, అక్టోబర్ 27: జిల్లాలో పెద్ద పులి సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. హాజీపూర్ మండలంలోని ర్యాలీ అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ ప్రాంతానికి సమీపంలో పులి సంచరిస్తున్నట్లు తెలియడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా వ్యవసాయ పనులు, పశువుల మేత కోసం అడవులు, పొలాల వైపు వెళ్లే వారు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఎటువైపు నుంచి పులి వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పులి సంచారం నేపథ్యంలో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సినఅవసరం ఉందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. అటవీ ప్రాంతాల్లో ఒంటరిగాతిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు సూచించారు. పులి సంచారంపై అధికారులు నిఘా ఉంచి.. దాని కదలికలను గుర్తించడం ద్వారా ప్రజలకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. పులి కనిపించినా.. దాని పాదముద్రలు లేదా ఇతర ఆనవాళ్లు గుర్తించినా ప్రజలు దాని దగ్గరకు వెళ్లకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి. కాగా, పులి సంచారానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై
రాష్ట్ర సీఈఓ క్షేత్రస్థాయి పరిశీలన

సోలార్ విద్యుత్ వినియోగం, కోళ్ల పెంపకం,
మహిళా సంఘాల జీవనోపాధి పై సమీక్ష
నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర సీఈఓ దివ్య దేవరాజన్





జననినాదం,తిర్యాణి,అక్టోబర్27: గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం, సౌర విద్యుత్ వినియోగం, గ్రామీణ ప్రజలకు స్వయం ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా జిల్లాలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్ర సీఈఓ దివ్య దేవరాజన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంగళవారం ఐటీడీఏ పీఓ మందమకరందు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌తో కలిసి తిర్యాణి మండలంలోని సుంగాపూర్ గ్రామ పరిధిలోని కొలంగూడ, గుడిపేట గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల పై సమీక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై సంబంధిత అధికారులు, స్థానికులతో చర్చించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ప్రజలకు మెరుగైన జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

సోలార్ విద్యుత్‌తో వ్యవసాయానికి ప్రయోజనాలు

గుడిపేట గ్రామంలో సౌర విద్యుత్ ఆధారంగా వ్యవసాయ మోటార్ల నిర్వహణ విధానాన్ని దివ్య దేవరాజన్ పరిశీలించారు. సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా రైతులకు కలుగుతున్న ప్రయోజనాలు, వ్యవసాయ అవసరాలకు విద్యుత్‌ను సమర్థవంతంగా వినియోగించే విధానాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం

అనంతరం గుడిపేట గ్రామంలో చేపడుతున్న కోళ్ల పెంపకం కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామీణ కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చడంలో పౌల్ట్రీ పెంపకం కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్యంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు వివిధ స్వయం ఉపాధి కార్యక్రమాలను చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించాలని సూచించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ స్థిరమైన ఆదాయ మార్గాలను అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు.

మహిళా సంఘాల కార్యకలాపాలపై సమీక్ష

అనంతరం మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మహిళా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు, గ్రామీణ జీవనోపాధి కార్యక్రమాలు, స్వయం ఉపాధి అవకాశాల అభివృద్ధిపై సమీక్షించారు. సంఘాల సభ్యులకు వివిధ జీవనోపాధి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని, ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

గ్రామీణ ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేలా, కుటుంబాలకు స్థిరమైన ఆదాయ మార్గాలు ఏర్పడేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, క్షేత్రస్థాయిలో కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి బి. దత్తారావు, సంబంధిత శాఖల అధికారులు, మండల సమాఖ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి...

సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట గత 15 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నమ్మె శిబిరంలో కొనసాగుతున్న దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్వాయి మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు గత 20 ఏళ్లుగా వైద్యారోగ్య శాఖలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి, వారిని క్రమబద్ధీకరించాలని కోరారు. వచ్చే శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యను ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారు. దేశంలోని ఏడు రాష్ట్రాల్లో ఉద్యోగులను క్రమబద్ధీకరించిన తరహాలోనే తెలంగాణలోనూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్, ఆసిఫాబాద్ పట్టణ అధ్యక్షుడు ఆకుల సంతోష్‌కుమార్‌తో పాటు పలువురు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఖో ఖోలో ఆసిఫాబాద్ అమ్మాయిల సత్తా

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టుకు ప్రథమ స్థానం
ఖేలో ఇండియాకు 7 మంది క్రీడాకారిణుల ఎంపిక
విజేతలను అభినందించిన కలెక్టర్ కె.హరిత



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27: రాష్ట్రస్థాయి ఖో ఖో ఛాంపియన్‌షిప్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలవడంలో ఆసిఫాబాద్ క్రీడాకారిణులు కీలక పాత్ర పోషించారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఈ నెల 14 నుంచి 17 వరకు నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఖో ఖో ఛాంపియన్‌షిప్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ జట్టులో ఆసిఫాబాద్‌లోని తెలంగాణ సంక్షేమ మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌కు చెందిన 10 మంది విద్యార్థినులు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చాటారు.

విజేతలకు కలెక్టర్ అభినందనలు...

జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో మంగళవారం విజేత క్రీడాకారిణులను జిల్లా కలెక్టర్ కె.హరిత సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఖేలో ఇండియా పోటీలకు క్రీడా పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులు ఎంపిక కావడం సంతోషకరమని పేర్కొన్నారు.

క్రమశిక్షణతో మరిన్ని విజయాలు సాధించాలి

క్రీడల్లో విద్యార్థినులు సాధిస్తున్న విజయాలు పాఠశాలకు గర్వకారణమని కలెక్టర్ అన్నారు. క్రమశిక్షణ, నిరంతర సాధన, కోచ్‌ల మార్గదర్శకత్వంతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాబోయే పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి బంగారు పతకం సాధించాలని సూచించారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

విద్యార్థినులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి


జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 27: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, హాజీపూర్ మండలం కర్ణమామిడిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను సందర్శించి విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యాబోధన, రిజిస్టర్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, వారికి నులభంగా అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తరగతులలో వెనుకబడిన విద్యార్థినులను గుర్తించి, వారి అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. విద్యార్థినులకు నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం సకాలంలో అందించాలని, పాఠశాలలలో పరిశుభ్రతను పాటించాలని, విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం హాజీపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. వైద్యులు, వైద్య సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ, రోగులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన అభ్యర్థులు ధ్రువపత్రాలతో హాజరుకావాలి

ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సృజన



జననినాదం,జైనూర్ 27: అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలనకు నిర్ణీత తేదీల్లో హాజరుకావాలని జైనూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సృజన అన్నారు. ప్రాజెక్టు పరిధిలోని జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్ మండలాల అభ్యర్థులకు నవంబర్ 4 నుంచి 7వ తేదీ వరకు జైనూర్ ఐసీడీఎస్ కార్యాలయంలో పరిశీలన నిర్వహించనున్నట్లు తెలిపారు. జైనూర్ మండల అభ్యర్థులకు 4, 5 తేదీల్లో, సిర్పూర్ (యు), లింగాపూర్ మండలాల వారికి 6, 7 తేదీల్లో ప్రక్రియ ఉంటుందన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువపత్రాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు విద్యార్హత, వయస్సు, స్థానికత, కుల ధ్రువీకరణ పత్రాల అసలు ప్రతులతోపాటు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన రెండు సెట్ల జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు.

సమన్వయంతోనే గ్రామీణాభివృద్ధి

ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాలి
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ దివ్య దేవరాజన్
గిన్నెదరిలోని మైకేల్ యోర్క్ సొసైటీ సందర్శన



జననినాదం, తిర్యాణి 27: గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కృషి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ దివ్య దేవరాజన్ అన్నారు. మంగళవారం గిన్నెదరిలోని మైకేల్ యోర్క్ ఎడ్యుకేషనల్ సొసైటీని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులతో మాట్లాడి, గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ శాఖలతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా తమవంతు సహకారం అందించాలని సూచించారు. ఆయా శాఖల మధ్య సమన్వయం ఉంటే అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామీణ ప్రజల అవసరాలను గుర్తించి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సమష్టిగా పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎల్‌పీ యువరాజ్ మార్మాట్, ఐటీడీఏ పీఓ మంద మకరంద్, గిన్నెదరి సర్పంచ్ నరేష్, మైకేల్ యోర్క్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు గేడం జనార్దన్, ప్రధాన కార్యదర్శి నైతం కృష్ణారావు, కోశాధికారి మాడవి గోపాల్, పీడీ సేకు, ఎస్‌సీఆర్‌పీ వెడ్మ ఏశ్వంత్రావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గోలేటి సీహెచ్‌పీ పిట్‌లో ఐఎన్‌టీయూసీ గేట్ మీటింగ్

కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నాం:ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్



జననినాదం,తాండూర్,27: ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కంపెల్లి సమ్మయ్య సూచనలతో చేపట్టిన బాయి బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీ పిట్ వద్ద ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు కాంగ్రెస్ ప్రభుత్వం, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ సింగరేణి పరిరక్షణతో పాటు కార్మికుల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని కార్మికులకు వివరించారు. లాభాల్లో కార్మికుల వాటా పెంపు, ఆదాయపు వన్ను రీయింబర్స్‌మెంట్, సొంత ఇంటి పథకం వంటి అంశాలపై ఉపముఖ్యమంత్రి, బొగ్గు ప్రాంత ఎమ్మెల్యేలు, మంత్రులతో పలుమార్లు చర్చించి, వాటి అమలుకు కృషి చేసినట్లు తెలిపారు.గత పది సంవత్సరాల పాలనలో సింగరేణి ఆర్థిక పరిస్థితి దెబ్బతిని, కార్మికులకు అన్యాయం జరిగిందని ఆయన విమర్శించారు. రానున్న రోజుల్లో ఐఎన్‌టీయూసీకి కార్మికులు మద్దతు ఇస్తే కార్మిక హక్కుల పరిరక్షణకు, సింగరేణి అభివృద్ధికి మరింత కృషి చేయవచ్చని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గోలేటి సీహెచ్‌పీ పిట్ కార్యదర్శి దుండ్రా రవికుమార్ క్రమశిక్షణారాహిత్యంగా వ్యవహరిస్తూ యూనియన్‌కు నష్టం కలిగిస్తున్నారనే కారణంతో ఆయనను ఐఎన్‌టీయూసీ పదవి నుంచి బహిష్కరించినట్లు యూనియన్ నాయకులు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ పిట్ కార్యదర్శి కొవ్వూరి శ్రీకాంత్ అధ్యక్షత వహించారు. ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శులు గోలెం గట్టయ్య, శ్యాంబాబు, తులాల సత్యనారాయణ, హరిబాబు, సదానందం, చెవ్వా సత్యనారాయణ, శీలం చందు, ఆడే తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జనాభా గణన వివరాలను స్పష్టంగా నమోదు చేయాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 27: జనగణన--2027 2వ దశలో భాగంగా నిర్వహించనున్న జనాభా గణన కార్యక్రమంలో వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ముఖ్య ప్రణాళిక అధికారి పాపయ్య, డైరెక్టరేట్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్ రాష్ట్ర కన్సల్టెంట్ కె.కృష్ణయ్య, మాస్టర్ ట్రైనర్ శరణ్య లతో కలిసి జిల్లా స్థాయి అదనపు ఛార్జ్ అధికారులు, మండల స్థాయి ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన మొదటి దశలో గృహాల జాబితా తయారీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులు, సిబ్బంది ప్రస్తుతం 2వ దశలో జనాభా గణనను ఖచ్చితత్వంతో, పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. జనగణనకు సంబంధించిన అన్ని అంశాలపై ఛార్జ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లకు అవసరమైన మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. జనగణన ప్రశ్నావళిలోని ప్రతి ప్రశ్నపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, ఏ వివరాన్ని ఏ విధంగా నమోదు చేయాలనే అంశంపై పూర్తి పట్టు సాధించాలని సూచించారు. అధికారులకు 2 రోజుల పాటు శిక్షణ అందించనున్నందున, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, అన్ని అంశాలను క్షుణ్ణంగా నేర్చుకోవాలని తెలిపారు. శిక్షణలో భాగంగా డెమో యాప్‌ను ప్రత్యక్షంగా చూపించనున్నందున, దాని వినియోగంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. జనగణన ద్వారా సేకరించే వివరాలు 16వ ఆర్థిక సంఘం నిధులు, గ్రాంట్లు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు సంబంధించిన నిధుల కేటాయింపులపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, సమాచార సేకరణలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు ప్రతి ప్రశ్నను సంబంధిత వ్యక్తిని అడిగి, సమాధానాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని తెలిపారు. మతం, కులం, వైవాహిక స్థితి, వివాహ సమయానికి వయస్సు. తండ్రి, తల్లి పేర్లు, పుట్టిన తేదీ, జన్మస్థలం, మతం వివరాలు, దివ్యాంగత్వానికి సంబంధించిన వివరాలు, అక్షరాస్యత స్థితి, డిజిటల్ అక్షరాస్యత, విద్యాసంస్థలలో ప్రస్తుతం చదువుతున్నారా అనే వివరాలు, 11వ తరగతి / అంతకంటే పై తరగతులలో చదివిన వారికి వర్తించే అత్యున్నత విద్యార్హత, విద్యా విభాగం (స్ట్రీమ్) వివరాలు, ప్రతి ప్రశ్నకు సంబంధించిన ఉద్దేశాన్ని అర్థం చేసుకొని, సమాధానాలను సక్రమంగా, స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. జనాభా గణన ప్రక్రియలో ఎన్యుమరేటర్లు అడగవలసిన ప్రశ్నలను వదిలివేయకుండా ప్రతి వివరాన్ని సేకరించాలని తెలిపారు. ప్రతి వివరాన్ని బాధ్యతాయుతంగా, ఖచ్చితత్వంతో నమోదు చేయాలని తెలిపారు. శిక్షణలో భాగంగా జనగణన శిక్షకులు జనాభా గణన ప్రశ్నావళి లోని వివిధ అంశాలపై అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి పాపయ్య, డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ రాష్ట్ర కన్సల్టెంట్ కె. కృష్ణయ్య, డి వై ఎస్ ఓ రాజేందర్, మాస్టర్ ట్రైనర్ శరణ్య, తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సంబంధిత జనగణన అధికారులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు రహదారులు కల్పించాలి

కమిషనర్ దివ్య దేవరాజన్‌కు చోర్‌పల్లి గ్రామపంచాయతీ ప్రతినిధుల వినతి



జననినాదం,సిర్పూర్ (యు), అక్టోబర్ 27: గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు, మారుమూల ఆదివాసీ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ కమిషనర్ శ్రీమతి దివ్య దేవరాజన్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీ పరిధిలోని గౌతంగూడ, అల్లిగూడ, రెంగారిట్ గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆయా గ్రామాల్లో బావులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. అలాగే పీవీటీజీ (ప్రత్యేకంగా బలహీన గిరిజన తెగలు) కొలం గిరిజనులు నివసించే రెంగారిట్ తదితర గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు అటవీశాఖ నుంచి అవసరమైన అనుమతులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అటవీ అనుమతుల నమన్యలను పరిష్కరించి, మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులతోపాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీరు, రహదారులు వంటి కనీన సౌకర్యాలు అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నహకరించి, ప్రజలు ఎదుర్కొంటున్న నమన్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

బీఎస్ఎన్ఎల్ టవర్‌కు జాయింట్ సర్వే



జననినాదం,సిరికొండ 27: మండలంలో బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. తహశీల్దార్ అరవింద్‌కుమార్, సిరిచెల్మ ఎఫ్ఆర్వో శ్రీనివాస్, సర్వేయర్లు గణేష్, రాజేశ్వరి స్థలాన్ని పరిశీలించారు. సర్వే త్వరగా పూర్తి చేసి, అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు. టవర్ నిర్మాణంతో మెరుగైన మొబైల్ నెట్‌వర్క్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు చర్యలు చేపడుతున్న అధికారులకు గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

అత్యంత పేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపాలి

3 వేల నిరుపేద కుటుంబాలను గుర్తించాం.. వారికి ఉపాధి కల్పించాలి 125 రోజుల పని కల్పించేలా చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27: జిల్లాలో అత్యంత పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించి, వారి జీవితాల్లో గుణాత్మక మార్పులు తీసుకురావాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ అధికారులకు సూచించారు. తెలంగాణ సమగ్ర జీవనోపాధుల కార్యక్రమం (టీజీఐఎల్పీ), వీబీ-జీ రామ్‌జీ పథకాల అమలుపై మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. కలెక్టర్ కె. హరిత, ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, జిల్లా అటవీ అధికారి బాలమణి తదితరులతో కలిసి పథకాల అమలుపై చర్చించారు.

3 వేల కుటుంబాల గుర్తింపు...

తెలంగాణ సమగ్ర జీవనోపాధుల కార్యక్రమం కింద జిల్లాలోని 3 వేల అత్యంత పేద కుటుంబాలను గుర్తించినట్లు కమిషనర్ తెలిపారు. వీరి ఆర్థిక, సామాజిక స్థితిగతుల్లో మార్పు తీసుకువచ్చేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలోని తిర్యాణి, లింగాపూర్ మండలాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనాలు అందించి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ పనులు విస్తృతం చేయాలి. వీబీ-జీ రామ్‌జీ పథకం కింద అర్హులైన కుటుంబాలకు 125 రోజుల పాటు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని దివ్య దేవరాజన్ ఆదేశించారు. జిల్లాలో 1,22,633 జాబ్ కార్డులు ఉన్నాయని, ఈ పథకం ద్వారా 375 రకాల పనులు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా సమాఖ్య భవనాలు, గిడ్డంగుల నిర్మాణాలను చేపట్టవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు కూలీలకు విస్తృతంగా ఉపాధి లభించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

నీటి సంరక్షణకు ప్రాధాన్యం...

జలసిరి పథకం ద్వారా పంట కుంటలు, ఊట కుంటలు, నీటి కుంటలు, ఇంకుడు గుంతలు నిర్మించాలని కమిషనర్ సూచించారు. వీటి ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకి, భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని వివరించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యమివ్వాలని, వీబీ-జీ రామ్‌జీ పథకం కింద పెద్ద సంఖ్యలో కూలీలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

పకడ్బందీగా అమలు చేస్తాం...

కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ జిల్లాలో టీజీఐఎల్పీ, వీబీ-జీ రామ్‌జీ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో అర్హులైన కూలీలకు పెద్దఎత్తున పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం కమిషనర్ దివ్య దేవరాజన్‌ను అధికారులు శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, టీజీఐఎల్పీ ప్రాజెక్టు అధికారులు, శిక్షకులు పాల్గొన్నారు.



అర్హులైన పేదలకు లబ్ధి చేకూరేలా చర్యలు

డిప్యూటీ తహసీల్దార్ రాజలింగు

ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల వివరాల పరిశీలన



జననినాదం,సిర్పూర్ (యు) 27: ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు లబ్ధి చేకూరేలా వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ రాజలింగు అన్నారు. మండలంలోని నెట్నూరు గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను ఆయన వెరిఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, పథకం అమలుకు సంబంధించిన అంశాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన పేదలకు పథకం ప్రయోజనాలు అందించేందుకు లబ్ధిదారుల వివరాల పరిశీలన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అర్హతలను నిర్ధారించే ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో వివరాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మడావి లక్ష్మణ్ పాల్గొన్నారు.

సహకార రంగ బలోపేతమే లక్ష్యం

తిర్యాణి పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ ...ఆదిలాబాద్ డీసీసీబీ 99వ మహాజన సభ



జననినాదం,తిర్యాణి 27: సహకార రంగాన్ని బలోపేతం చేస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని తిర్యాణి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ చుంచు శ్రీనివాస్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ (డీసీసీబీ) 99వ మహాజన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార రంగం కేవలం బ్యాంకింగ్ వ్యవస్థకే పరిమితం కాదని, రైతుల ఆర్థిక అభివృద్ధికి అండగా నిలుస్తూ గ్రామీణ ప్రాంతాల ప్రగతికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. రైతులకు సకాలంలో రుణాలు అందించడం, మెరుగైన బ్యాంకింగ్ సేవలు కల్పించడం, వ్యవసాయ అవసరాలకు ఆర్థిక సహకారం అందించడంలో సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. 99వ మహాజన సభ సహకార రంగ ప్రగతి, సంఘాల బలోపేతం, రైతుల ప్రయోజనాలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు ముఖ్యమైన వేదికగా నిలుస్తుందన్నారు. సహకార సంఘాలు పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేస్తూ రైతుల నమ్మకాన్ని మరింత పెంపొందించుకోవాలని సూచించారు. రైతుల సమస్యలను గుర్తించి, వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. సహకార రంగ అభివృద్ధితోపాటు రైతుల సంక్షేమం, పీఏసీఎస్‌ల బలోపేతానికి సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్లు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడితో రైతులకు ప్రయోజనం

రాసి 659తో మెరుగైన ఫలితాలు

రాసి సీడ్స్ ఆర్‌సీఎం కె.ప్రమోద్ కుమార్



జననినాదం, జైనూర్ 27: పత్తి సాగులో రైతులు అధిక దిగుబడి సాధించడంతోపాటు పంట కోత పనులు సులభతరం చేసుకునేందుకు రాసి సీడ్స్ 659 రకం విత్తనాలు దోహదపడతాయని రాసి సీడ్స్ ఆర్‌సీఎం కె.ప్రమోద్ కుమార్ అన్నారు. మండలంలోని మార్కగుడా గ్రామంలో రైతు సలీంబాయి పత్తి చేనులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ రకం విత్తనాలతో అధిక కాయలు ఏర్పడి, మెరుగైన దిగుబడి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రసం పీల్చే పురుగులు, దోమపోటు, తామర పురుగులను తట్టుకునే సామర్థ్యం ఉండటం వల్ల పంట సంరక్షణలో రైతులకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. పత్తి తీసేందుకు సులభంగా ఉండటం వల్ల కూలీల శ్రమ తగ్గే అవకాశం ఉందన్నారు. రైతులు తమ ప్రాంత వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, సాగునీటి వనతులను పరిగణనలోకి తీసుకొని విత్తనాలను ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, డీలర్లు, డిస్ట్రిబ్యూటర్ కిశోర్ బివాజి, ఈఏఎస్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆహార భద్రత చట్టం--2006 అమలుకు సమర్థవంతమైన చర్యలు

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 27: జిల్లాలో ఆహార భద్రత చట్టం 2006 అమలుకు అధికారుల సమన్వయంతో సమర్థవంతమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ నుండి ఆహార భద్రత అధికారి వాసురామ్ తో కలిసి ఆహార భద్రత, ప్రమాణాల చట్టం--2006పై నిర్వహించిన ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా ఆహార భద్రత చట్టంలోని నిబంధనలు, ఆహార నాణ్యత ప్రమాణాలు, ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, చట్ట అమలుకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఆహార భద్రత చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సెర్ప్ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27:జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్‌కు జిల్లా సెర్ప్ సిబ్బంది తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు. సిబ్బంది సమస్యలు వివిధ దశల్లో ఉన్నాయని, ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సెర్ప్ సిబ్బందికి రెండు క్యాడర్ల పెంపు, పంచాయతీరాజ్ సిబ్బంది సర్వీసు నిబంధనలను అమలు చేయడం, అర్హులందరికీ పదోన్నతులు కల్పించడం, ఇంటి స్థలాలు కేటాయించడం, ఇంటి నిర్మాణానికి స్త్రీనిధి ద్వారా రూ.30 లక్షల వడ్డీలేని రుణం అందించడం, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. ఈ సమస్యలు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని ఏపీఎం మైస రమేష్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇంటి నిర్మాణానికి స్త్రీనిధి ద్వారా వడ్డీలేని రుణం అందించే అంశంపై ఆమె సానుకూలంగా స్పందించినట్లు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు అప్పాల రామకృష్ణ, యాదగిరి, యశోద, నరేందర్, నాగజ్యోతి, ఏపీఎంలు చిలువేరి శ్రీనివాస్, సదానందం, ధన్‌రాజ్, సూర్యకాంత్, సీసీలు రమేష్, కుర్ర రమేష్, అడ్మిన్ అసిస్టెంట్లు సుజాత, నాగేంద్ర ప్రసాద్, మురళి, శ్రీనివాస్, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలలో పెంపొందించాలి

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 27: ప్రభుత్వ పాఠశాలలను విద్య అభ్యసిస్తున్న విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని జైపూర్ మండలం నర్వ పరిధిలో విద్య, అంగన్‌వాడీ సేవలు, పారిశుధ్యం, నీటి సంరక్షణ, గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, అనధికార లేఅవుట్లకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలని తెలిపారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన స్థాయిని, పాఠ్యాంశాలపై అవగాహనను పరీక్షించారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి వారు అర్థం చేసుకున్న అంశాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడి ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం కార్యక్రమం అమలు తీరు, బేస్‌లైన్ పరీక్షల ఫలితాలు, విద్యార్థుల అభ్యసన పురోగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోధనలో వినియోగిస్తున్న బోధనాభ్యసన సామగ్రి గురించి సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందిస్తున్న సేవలు, పోషకాహారం పంపిణీ తీరును పరిశీలించారు. వంటగదిని సందర్శించి ఆహార తయారీ, పిల్లలకు అందిస్తున్న భోజనం వివరాలను తెలుసుకున్నారు. చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించడంతో పాటు, వంటగది, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పాఠశాల వద్ద కమ్యూనిటీ సోక్ పిట్ నిర్మాణానికి చేపట్టిన మార్కింగ్ పనులను పరిశీలించారు. మురుగునీటి నిర్వహణకు అవసరమైన నిర్మాణాలను వ్రణాళికాబద్ధంగా చేవట్టి, గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వినియోగించుకోవాలని, త్రాగునీటిని పొదుపు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నీటి వృథాను నివారించేందుకు ప్రజలు సహకరించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని సందర్శించి పరిపాలనకు అవసరమైన మౌలిక సదుపాయాలు, కార్యాలయ నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. గ్రామ పరిధిలోని అనధికార లేఅవుట్లను సందర్శించి, వివరాలను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో భూ వినియోగం, లేఅవుట్లకు సంబంధించిన నిబంధనల అమలుపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 27: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన రోడ్డు భద్రతా సమావేశంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, బెల్లంపల్లి, జైపూర్ ఎసిపిలు, జాతీయ రహదారుల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులపై ఆక్రమణలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, జాతీయ రహదారి-363పై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ గన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, రహదారులపై తగినంత వెలుతురు ఉండేలా లైటింగ్ సదుపాయాలను మెరుగుపరచాలని తెలిపారు. రహదారులపై పశువుల సంచారం వల్ల ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు గోశాల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రవాణా శాఖ అధికారులు ఓవర్‌లోడ్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై అవసరమైన మేరకు లైసెన్సుల సస్పెన్షన్ చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాల బస్సుల ఫిట్‌నెస్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, ఫిట్‌నెస్ లేని వాహనాలను నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని, ఇన్సూరెన్స్ లేకుండా తిరిగే వాహనాలపై జరిమానాలు విధించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్‌పై పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపాలిటీల వరిధిలో భవనాల సెల్లార్లను పార్కింగ్ అవసరాలకే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా రహదారులపై వాహనాల పార్కింగ్‌ను నియంత్రించి ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలను తగ్గించాలని తెలిపారు. రోడ్డు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సంబంధిత శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు చేవట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి వైపే అడుగులు వేస్తున్నాం: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్ 4వ డివిజన్‌లో రూ. 78 లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమిపూజ



కరీంనగర్ అక్టోబర్ 27: కరీంనగర్ ను అభివృద్ధి చేయడం వైపే అడుగులు వేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా బుధవారం నగరంలోని 4వ డివిజన్ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పర్యటించి... పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దుర్గానగర్ - గోపాల్ పూర్ రోడ్డులో రూ. 78 లక్షల యుఐడిఎఫ్ నిధులతో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ భూపతి రవీందర్, పలువురు కార్పొరేటర్లతో కలిసి సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పనులకు కేంద్ర మంత్రి భూమీ పూజ చేసి పనులను ప్రారంభం చేశారు. అనంతరం దుర్గానగర్- గోపాల్ పూర్ రోడ్డులో ఉన్న స్వయంభు విఘ్నేశ్వర స్వామీ ఆలయాన్ని మంత్రి బండి సంజయ్ కుమార్ సందర్శించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, పలువురు కార్పొరేటర్లతో కలిసి స్వామీ వారిని దర్శించుకొని... ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి.. మొక్కులు చెల్లించుకున్నారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తో పాటు మేయర్, డిప్యూటీ మేయర్లను స్థానిక కార్పొరేటర్ ప్రజలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. నగరాభివృద్ధికి కృషి చేస్తూ.. ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. యూఐడిఎఫ్ నిధులతో పాటు ఇతర గ్రాంట్ల నిధులతో పాలకవర్గం పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం చేసి... ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. త్వరలో యూసిఎఫ్ నిధులతో నగరంలో అభివృద్ధి పనులు ప్రారంభం చేసి... ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ గెలిచిందని ఆర్ వోబీపై నిర్లక్ష్యమా...

అవసరమైతే అసెంబ్లీలో ధర్నా చేస్తా... మాధవ్ నగర్ ధర్నాలో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ధ్వజం....



నిజామాబాద్ అక్టోబర్ 27: ఇందూరులో బీజేపీ గెలిచిందని మాధవ్ నగర్ ఆర్ఓబిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ధ్వజమెత్తారు. నగర శివారులోని మాధవనగర్ ఆర్ వోబీ పనుల జాప్యంపై మంగళవారం మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...తాను ఇక్కడకి ఎమ్మెల్యేగా కాదని, మీలో ఒకడిగా మీ బాధను పంచుకోవడానికి వచ్చానన్నారు.
ఈ మాధవ్ నగర్ గేటుతో నరకయాతన పడాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ రోడ్డు మీదుగా అన్ని రకాల వాహనాలు నుమారు 4 నుంచి 5 వేల వరకు రాకపోకలు కొనసాగిస్తాయన్నారు. అలాగే ప్రతిరోజు 24 గంటల్లో 58 రైళ్ల రాకపోకలు కొనసాగుతాయని పేర్కొన్నారు. దీంతో ప్రతిసారి 15 నుంచి 20 నిమిషాల వరకు గేటు పడటం, భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు.ప్రధానంగా ఈ సమస్యతో స్కూల్ పిల్లలు స్కూల్ కి లేట్... కూలీలు పనికి లేట్..రోగులు హాస్పిటల్ కి లేట్... ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగానికి లేట్... చివరికి శవాలు కూడా స్మశానానికి లేట్ గా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.ఎంపీ ధర్మపురి అరవింద్ ఆర్ వోబీ కొరకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ని కలిసి కేంద్ర నిధులు మంజూరు చేయించారన్నారు. రైల్వే శాఖ తనవంతు పని పూర్తి చేసిందని, మరి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మాధవ్ నగర్ ఆర్ఓబిపై ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డిని గత ఏడాది కలిస్తే వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం ఇచ్చినట్లు గుర్తు చేశారు.కానీ ఇప్పటివరకు ఎందుకు పూర్తి కావడం లేదన్నారు. ఇది నిజామాబాద్ అర్బన్ ప్రజలను అవమానించడమేనని విమర్శించారు.

ఎల్ నినో నేపథ్యంలో ఆరుతడి పంటలనే సాగు చేయాలి

ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి
ఖరీఫ్ పంటను గట్టెక్కిస్తాం...రబీలో మాత్రం వరి వేస్తే కాపాడలేం
ఆరుతడి సాగుకు అన్నివిధాలుగా తోడ్పాటును అందిస్తాం
కొత్తగా బోరుబావులు తవ్వితే సీజ్ చేస్తామని స్పష్టీకరణ



నిజామాబాద్, అక్టోబర్ 27 : ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రైతులు రబీలో ఆరుతడి పంటలనే సాగు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా తదితర పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఒకవేళ వరి మినహా ఇతర పంటల సాగుకు చౌడు భూములు వంటి నేల రకాలు సహకరించకపోతే క్రాప్ హాలిడే పాటించాలని, వరి సాగు మాత్రం చేయవద్దని స్పష్టం చేశారు.నందిపేట మండలం నూత్ పల్లి రైతు వేదికలో మంగళవారం ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులనుద్దేశించి మాట్లాడారు. ఖరీఫ్ లో వేసిన వరి పంట పూర్తి స్థాయిలో చేతికి అందేంత వరకు జిల్లా యంత్రాంగం తరపున కాపాడుతామని రైతులకు భరోసా కల్పించారు. అయితే రబీలో మాత్రం వరి పంటకు సాగు నీరు అందించే పరిస్థితి ఉండదని కలెక్టర్ వెల్లడించారు. సూపర్ ఎల్ నినో ప్రభావంతో ప్రతీకూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై రైతులకు కీలక సూచనలు చేశారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పెసలు, మినుములు, శనగతో పాటు జొన్న, మొక్కజొన్న, కూరగాయలు వంటి పంటల సాగును చేపట్టడం ఎంతో శ్రేయస్కరమని రైతులను ప్రోత్సహించారు. బిందు సేద్యాన్ని వినియోగించుకొని ఆయిల్‌పామ్ తోటలు, కూరగాయలు తదితర పంటలను సాగు చేయడం ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకోవచ్చని అన్నారు. ఆరుతడి పంటల సాగుకు ముందుకు వచ్చే రైతాంగానికి ప్రభుత్వ పరంగా జిల్లా యంత్రాంగం తరఫున తోడ్పాటును అందిస్తామని భరోసా కల్పించారు. మల్చింగ్, బిందు సేద్యం విధానాలకు రాయితీ వర్తించేలా ప్రణాళికలు రూపొందిస్తామని అన్నారు. కూరగాయలు, ఇతర ఆరుతడి పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే దిశగా కూడా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వీబీజీరాంజీ కింద ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి పనులను చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించుకోవడంపై దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. అయితే ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో కొత్తగా బోరుబావులు తవ్వకూడదని, ఎవరైనా తవ్వినట్లు తమ దృష్టికి వస్తే వాటిని సీజ్ చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రస్తుతం ప్రధాన జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను తాగునీటి అవసరాలకే వినియోగిస్తామని కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయని, రానున్న రోజుల్లో సేద్యానికి కరెంటు సరఫరాకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని, యాసంగిలో వరి సాగు చేసి ఇబ్బందుల్లో పడవద్దని జిల్లా పాలనాధికారి హితవు పలికారు. ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక మహిళా సంఘాల ప్రతినిధులు సైతం రబీలో రైతులు ఆరుతడి పంటలే సాగు చేసేలా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తూ వారికి అవగాహన కల్పించాలని అన్నారు.ఈ సందర్భంగా ఆదర్శ రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించగా, రబీలో ఏ తరహా పంటలు సాగు చేయవచ్చు, కరువు పరిస్థితులను అధిగమించేందుకు అనుసరించాల్సిన విధానాలు ఏమిటీ తదితర అంశాలపై వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ రావు, ఉద్యానవన శాఖ అధికారిణి సంధ్య, సర్పంచ్ రాజిరెడ్డి, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ నేతలతో కేంద్ర మంత్రి భేటీ

నవంబర్ 5న కరీంనగర్‌లో బీజేపీ మహా ర్యాలీ: బండి సంజయ్



కరీంనగర్ అక్టోబర్ 27: నవంబర్ 5న కరీంనగర్‌లో వేలాది మందితో మహా ర్యాలీ నిర్వహించనున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడించారు. "ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం -- అరాచకత్వాన్ని అంతం చేద్దాం" అనే నినాదంతో నిర్వహించే ఈ ర్యాలీకి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుతో పాటు జాతీయ నాయకులు హాజరవుతారని తెలిపారు. కరీంనగర్‌లోని శుభమంగళ కన్వెన్షన్‌లో బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి నేతలతో నిర్వహించిన సమావేశంలో ర్యాలీ ఏర్పాట్లు, జన సమీకరణపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో పాటు విద్యార్థులు, యువత, న్యాయవాదులు, వైద్యులు, ఇంజనీర్లు, మేధావులు సహా అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్, ఇతర విపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు కరపత్రాల ద్వారా ప్రజలకు వాస్తవాలు వివరించాలని, మీడియా, సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటునాగార్జున పాలడైరీ ఔదార్యం



హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 27: హుజురాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి గ్రామంలోని నాగార్జున డైరీలో ఉద్యోగుల కోసం మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి మేనేజింగ్ డైరెక్టర్ పుల్లూరి ప్రభాకర్ రావు ఔదార్యం చాటుకున్నారు. వైద్యుడు డాక్టర్ ఎన్ రమేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యుడు రమేష్ డెయిరీలో పనిచేస్తున్నప్పుడు తీసుకోవాలసిన జాగ్రత్తల గురించి వివరించి, నడక, వ్యాయామం, మెడిటేషన్ ల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అవలంభిస్తామని సిబ్బందిచే డైరీ ఏజీఎం సుధాకర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ శిబిరంలో డైరెక్టర్ పుల్లూరి గణేష్ రావు, సీఈవో కృష్ణప్రసాద్, ప్లాంట్ మేనేజర్ మాటూరి శ్రీనివాస్, మేనేజర్లు శ్రీనివాస్, సంతోష్ , సిబ్బంది , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం

రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే మహోన్నత సేవ: సీపీ గౌష్ ఆలం, ఐపీఎస్



కరీంనగర్ అక్టోబర్ 27: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ ఆదేశాల మేరకు మంగళవారం కరీంనగర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, మానవతా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే మహోన్నత సేవ అని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను రక్షించడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానానికి కులం,మతం, ప్రాంతం, లింగభేదాలతో సంబంధం లేదని, ఇది మానవత్వానికి,సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని సీపీ పేర్కొన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో గాయపడిన వారికి సకాలంలో రక్తం అందించడం ఎంతో కీలకమని తెలిపారు. రక్తదానం చేసే ముందు వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అనంతరం వైద్యుల సూచనల మేరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బంది సేవలను స్మరించుకుంటామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పటివరకు 47 మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించారని, వారి త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలను గౌరవించడం, వారి త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ రక్తదాన కార్యక్రమశీలో ఏసీపీ లు శ్రీనివాస్, శ్రీనివాస్ జి, వెంకటస్వామి, విజయకుమార్, స్వామి పాల్గొన్నారు. అంతేకాకుండా శిబిరానికి సహకరించిన ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషారాణి,ఆర్ఎంఓ, వైద్య బృందానికి, స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారందరికీ పోలీస్ శాఖ తరఫున సీపీ కృతజ్ఞతలు తెలిపారు.

చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో..

డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయాలి!

రక్త పరీక్షల కోసం రోగుల అవస్థలు..
రిపోర్టుల కోసం 24 నుంచి 48 గంటల నిరీక్షణ!



చెన్నూరు: అక్టోబర్ 27, (నేటి ఇజం) : చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షల కోసం రోగులు పెద్ద ఎత్తున లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ సేకరించిన రక్త నమూనాలను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి పరీక్షలు నిర్వహించాల్సి వస్తోంది. అనంతరం రిపోర్టులు చెన్నూరుకు చేరేందుకు సుమారు 24 గంటల సమయం పడుతోంది. ఒకవేళ ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తితే రిపోర్టులు అందడానికి 48 గంటల వరకు ఆలస్యం అవుతోంది. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సకాలంలో పరీక్షలు నిర్వహించి, త్వరగా వైద్యం అందించడం ఎంతో ముఖ్యం. అలాంటప్పుడు రిపోర్టుల కోసం ఒకటి, రెండు రోజులు వేచి చూడాల్సి రావడం రోగులకు ఇబ్బందికరంగా మారుతోంది. చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలోనే డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేస్తే రక్త పరీక్షలు స్థానికంగానే నిర్వహించే అవకాశం ఉంటుంది. దీంతో పరీక్షల ఫలితాలు త్వరగా అందడంతో పాటు వైద్యులు సకాలంలో చికిత్స ప్రారంభించేందుకు వీలవుతుంది. కావున గౌరవ మంత్రి వర్యులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయి డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైప్‌లైన్లను తరలించాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెండింగ్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

రామగుండంలో మసీదు చౌరస్తా నుంచి లింగాపూర్ రోడ్డు వరకు నిర్మాణ పనుల పరిశీలించిన జిల్లా కలెక్టర్



గోదావరిఖని27:రామగుండంలో మసీదు చౌరస్తా నుంచి లింగాపూర్ రోడ్డు వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణానికి ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైప్‌లైన్లను రెండు వారాల్లో తరలించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండంలోని మసీదు చౌరస్తా వద్ద జయగుతున్న రోడ్డు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణ పనులకు ఆటంకంగా ఉన్న తాగునీటి పైప్‌లైన్లు, విద్యుత్ జెన్‌కో స్తంభాలు, డిస్కం విద్యుత్ స్తంభాల తరలింపు పనులను రెండు వారాల్లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా పనులను సమన్వయంతో చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ పర్యటనలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో మయన్మార్ మహిళపై అఘాయిత్యం

స్నేహితులతో కలిసి భర్త గ్యాంగ్ రేప్!



హైదరాబాద్: హైదరాబాద్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. మయన్మార్‌కు చెందిన మహిళపై ఆమె భర్తతో పాటు మరో ముగ్గురు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కంచన్‌బాగ్ పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. మయన్మార్‌కు చెందిన మహిళను బంగ్లాదేశ్‌కు చెందిన ఫయజ్ అనే వ్యక్తి వివాహం చేసుకున్నాడు. అనంతరం వీరిద్దరూ హైదరాబాద్‌కు వచ్చి కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిసైన ఫయజ్.. తన స్నేహితులతో లైంగిక సంబంధాలు పెట్టుకోవాలంటూ భార్యపై ఒత్తిడి తెచ్చాడు. ఈ క్రమంలోనే ఆమెపై భర్తతో పాటు మరో ముగ్గురు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితురాలు కంచన్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో భర్త ఫయజ్‌తో పాటు మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులంతా బంగ్లాదేశ్‌కు చెందిన వారిగా గుర్తించినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

నల్లగొండ జిల్లాలోకి ప్రవేశించిన బీసీ రాజ్యాధికార యాత్ర

పడమటిపల్లికి చేరుకున్న తీన్మార్ మల్లన్న పాదయాత్ర



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో యాత్ర పూర్తి.. తీన్మార్ మల్లన్నకు ఘన స్వాగతం పలికిన టీఆర్పీ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు

నల్లగొండ జిల్లా, అక్టోబర్ 27 (నేటి ఇజం):బీసీలకు రాజకీయ ప్రాతి నిధ్యం, సామాజిక న్యాయం కల్పించడంతో పాటు రాజ్యాధికారంలో సముచిత వాటా సాధించడమే లక్ష్యంగా తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికార యాత్ర మంగళవారం నల్లగొండ జిల్లాలోకి ప్రవేశించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పాదయాత్రను పూర్తి చేసుకున్న ఆయన, నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని వడమటివల్లి గ్రామానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు తీన్మార్ మల్లన్నకు ఘన స్వాగతం పలికారు. యాత్రలో భాగంగా బీసీల రాజకీయ హక్కులు, సామాజిక న్యాయం, రాజ్యాధికారంలో వారి భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఆయన ముందుకు సాగుతున్నారు. బీసీ వర్గాలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో కొనసాగు తున్న ఈ పాదయాత్రకు వివిధ ప్రాంతాల్లో బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలుపుతున్నారు.పడమటిపల్లి గ్రామం నుంచి దేవరకొండ వైపు బీసీ రాజ్యాధికార యాత్ర కొనసాగనుంది.

ములుగు జిల్లా తాడ్వాయి అడవుల్లో రాతి గుహ



తాడ్వాయి(ములుగు): ములుగు జిల్లా తాడ్వాయి మండలం దామరవాయి, భూపతిపూర్ గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతంలో గుహ ఉన్నట్టు వెలుగులోకి వచ్చింది. జింకల పడ అనే అటవీ ప్రాంతంలో గుడ్డేలుగు గుహ ఉందని, అటు వైపు వెళ్తే ప్రమాదమని ప్రచారం జరుగుతోంది. దామరవాయి గ్రామానికి చెందిన యువకుడు కార్తీక్ తన స్నేహితులు మహేష్, నాగరాజులతో కలి సి ఈనెల 20న గుహను సందర్శించాడు. గ్రామం నుంచి గుహ జాడలు గుర్తిస్తూ గంటలపాటు అడవిలో వీరు ప్రయాణించారు. చివరకు గుహను గుర్తించామని కార్తీక్ తెలిపాడు. సోమవారం గుహను సందర్శించగా అది మూడు మీటర్ల సొరంగం కనిపించింది. లోపల సన్నటి దారి ఉంది. వ్యక్తి పడుకొని వెళ్లేలా మూడు మీటర్ల పొడవుతో సొరంగం కనిపించింది. అది దాటిన తర్వాత గది ఉంది. అందు లోవ్యక్తి పడుకునే విధంగాఏర్పాటు చేసి ఉంది. ఈ గుహలో గబ్బిలాలు వందల సంఖ్యలో వేలాడుతూ కనిపించాయి. కొత్తగా వెలుగులోకి వచ్చిన ఈ గుహను చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. ఆనవాలనుబట్టి ఇందులో ఆదిమానవులు నివసించి ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు. గుహకు దగ్గరలోనే దామరవాయి రాక్షస సమాధులు ఉన్నాయని, ఈ ప్రాంతంలో అదిమానవులు నివసించారనడానికి ఇది నిదర్శనమని చెబుతున్నారు.

ముస్సిపల్ హోదా.. కూలీలకు శాపం..

ఎంపీ బలరాం నాయక్‌కు వినతిపత్రం అందజేత

డోర్నకల్: గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు చేతినిండా పని కల్పించిన ఉపాధి హామీ పథకం మున్సిపాలిటీగా మారడంతో పేద ప్రజల బతుకులను రోడ్డున పడేసింది. అభివృద్ధి పేరుతో ప్రభుత్వం కల్పించిన మున్సిపల్ హోదా డోర్నకల్ పట్టణంలోని దినసరి కూలీల జీవితాల్లో చీకట్లు నింపింది. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరుతూ పురపాలక సంఘ మాజీ చైర్మన్ వాంకుడోత్ వీరన్న గత సోమవారం పట్టణానికి విచ్చేసిన మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2018లో డోర్నకల్ మేజర్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా అప్గ్రేడ్ చేస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తుచేశారు. అయితే సంతకాల సేకరణ జరిపిన మాట వాస్తవమే.. కానీ ఉపాధి హామీ పనిని కోల్పోతామని, పన్నుల భారం పేద ప్రజలకు గుదిబండగా మారుతుందని తెలియలేదని వాపోయారు.దాదాపు15,000 జనాభాలో అధిక శాతం పేద ప్రజలు, గిరిజనులు దినసరి కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తుంటారని తెలిపారు.ఈ గ్రేడ్ 3 మున్సిపాలిటీలో ఉపాధి హామీ పనికి దూరమవడంతో బతుకుతెరువు లేక పొట్టచేతపట్టుకుని దూర ప్రాంతాలకు వలస వెళ్లి జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పురపాలక సంఘం ఏర్పాటు నాటి జనాభా ప్రస్తుతం వలసల కారణంగా ఇక్కడ లేకపోవడం గమనార్హమన్నారు. అదేవిధంగా సూపర్ ఎల్ నినో ప్రభావంతో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు,కరువు సెగలతో రైతులు కూలీలుగా మారే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున కార్గే, ప్రతిపక్ష ముఖ్య నాయకులు రాహుల్ గాంధీ దృష్టికి ఇక్కడి పరిస్థితులను వివరించాల్సిందిగా ఎంపీ బలరాం నాయక్ ను కోరినట్లు వీరన్న తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ పార్లమెంట్ లో సైతం ఉపాధి హామీ అంశాన్ని ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మున్సిపాలిటీ పరిధిలో ఉపాధి హామీ పని అమలు చేసే వరకు పట్టణ ప్రజలను, కార్మికులను సంఘటితం చేసి దశల వారీగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మాజీ చైర్మన్ వీరన్న హెచ్చరించారు.

రైతులకు సాగునీరు, మద్దతు ధర విషయంలో రాజీ లేదు

దళారుల చేతుల్లో రైతులు మోసపోవద్దు.. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పది రోజుల పాటు ఎస్సారెస్పీ నీరు అందించి పంటలను కాపాడాం

రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



పెద్దపల్లి, అక్టోబర్ 27 (నేటి ఇజం): రైతులకు సాగునీరు అందించడం, పంటలకు మద్దతు ధర కల్పించడం విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పనిచేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ఎస్సారెస్పీ ద్వారా పది రోజుల పాటు నీరు అందించి రైతుల పంటలను కాపాడామని తెలిపారు. రైతులు దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల, తుర్కలమద్దికుంట గ్రామాలతో పాటు సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామంలో మంగళవారం సింగిల్ విండోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను విజయరమణ రావు, స్థానిక [redacted] ండేందుకే పెద్దపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభిస్తున్నామని వివరించారు. రైతులు ఐకేపీ, సింగిల్ విండో సొసైటీల ద్వారా ఏర్పాటు చేసిన కేం ద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. బయట మార్కెట్‌లో అధిక ధర లభిస్తే అక్కడ విక్రయించుకోవచ్చని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడం కూడా రైతుల ఇష్టమేనని స్పష్టం చేశారు. 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు క్వింటాలుకు రూ. 2,462 మద్దతు ధర చెల్లిస్తామని, విక్రయించిన 48 గంటల్లోనే డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సన్న వడ్లకు రాష్ట్ర [redacted] బోనస్ అందిస్తోందని, దీనితో [redacted] కు లభిస్తుందని వివరించారు. [redacted] ంలో రైతులను ఇబ్బందులకు [redacted] ల ఇన్‌చార్జీలపై చర్యలు [redacted] తొలగిస్తామని హెచ్చరించారు. [redacted] తులకు సూచనలు: తుఫాను



ప్రభావం ఉన్న నేపథ్యంలో రైతులు కోసిన ధాన్యం తడవకుండా పాలిథిన్ కవర్లతో కప్పి భద్రపరచుకోవాలని సూచించారు. సూపర్ ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో భవిష్యత్తులో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. వ్యవసాయ బావుల్లో నీటి లభ్యతను బట్టి వరికి వినియోగించే నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఆరుతడి పంటలు సాగు చేసే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. వేసవిలో నీటి కొరత కారణంగా పంట నష్టం జరగకుండా రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు.రైతులకు సాగునీరు అందించడం నుంచి ధాన్యం కొనుగోలు వరకు ప్రతి విషయంలో అండగా ఉంటామని, రైతుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని విజయరమణ రావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్, పెద్దపల్లి మరియు కనుకుల సింగిల్ విండో చైర్మన్లు, పెద్దపల్లి, సుల్తానాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

P [redacted] nd Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar c [redacted] Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, A [redacted] DAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com.Phone no:9550100197,9490111460